క్లుప్తంగా

'బీసీలను విస్మరించిన బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు'

నకిరేకల్ : బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు బీసీలను విస్మరించాయని ప్రజా శాంతి పార్టీ నకిరేకల్ ఎమ్మెల్యే అభ్యర్థి కదిరే కిరణ్‌కుమార్ ఆరోపించారు. నకిరేకల్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు బీసీలకు 60 శాతం సీట్లు ఇవ్వాల్సి ఉండగా అందులో సగం కూడా ఇవ్వకుండా మోసం చేశాయని అన్నారు. రాబోయే ఎన్నికల్లో ప్రజా శాంతి పార్టీని గెలిపించాలని కోరారు. ఈసమావేశంలో మల్లయ్య, సైదులు, ప్రవీణ్, శ్రవణ్, ప్రసాద్ పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత



కట్టంగూర్ : ఫిక్స్‌డ్ డిపాజిట్ పత్రాలను అందజేస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

కట్టంగూర్ : మండలంలోని పరడ గ్రామానికి చెందిన లారీ డ్రైవర్ రత్నం రవి ఇటీవల మృతి చెందాడు. సహచర డ్రైవర్ కుటుంబాన్ని ఆదుకునేందుకు ఆ గ్రామ లారీ డ్రైవర్స్ అసోసియేషన్ నాయకులు లక్ష రూపాయలు సమకూర్చి మృతుడి కుటుంబసభ్యుల పేరిట పోస్ట్ ఆఫీస్‌లో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి పత్రాలను సోమవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు టేకుల శ్రీనివాస్, జీడీపల్లి లింగారెడ్డి, గణేశ్, సైదులు, నర్సిరెడ్డి, ఉపేందర్, వెంకన్న, సతీష్, లింగం యాదవ్, శేఖర్ పాల్గొన్నారు.

మునుగోడు : మండలంలోని రావిగూడెం గ్రామానికి చెందిన నిరుపేద మాడుగుల వెంకన్న(40) అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయన అంత్యక్రియల నిమిత్తం సోమవారం కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు నారబోయిన రవి రూ.10వేల ఆర్థికసాయాన్ని బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఆయన వెంట వేమిరెడ్డి జితేందర్ రెడ్డి, అనంత లింగస్వామి, ఎండీ రఫీక్, జంగిలి నాగరాజు, జేట్టి గణేష్, టేకుమట్ల శ్రీరాములు, బీసం విజయ్, చలమల్ల యాదగిరి తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడిగా బొడ్డు నగేశ్



శాలిగౌరారం : మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో సోమవారం జరిగిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశంలో గ్రామశాఖ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కాంగ్రెస్ పార్టీ శాలిగౌరారం గ్రామశాఖ అధ్యక్షుడిగా మార్కెట్ కాలనీకి చెందిన బొడ్డు నగేశ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల, గ్రామ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వేముల వీరేశం సమక్షంలో కాంగ్రెస్‌లోకి

చిట్యాల : మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డులకు చెందిన నాయకులు సోమవారం నకిరేకల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి వేముల వీరేశం సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో మైల మల్లేష్ యాదవ్, మైల సాయి యాదవ్‌తో పాటు మరికొందరు ఉన్నారు.

ఓటు హక్కుపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న యూత్ సభ్యులు

మర్రిగూడ : ఎన్నికల్లో వేసే ప్రతి ఓటు విలువైందని జైభీమ్ సాహో యూత్ అధ్యక్షుడు ఈద గిరీశ్వర్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో ఓటు హక్కుపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈద రమేష్, ప్రభుదాస్, సురేష్, అభి, సందేష్, కాశీ, వెంకటేష్, శివరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఫిట్స్‌తో వ్యక్తి మృతి

నార్కట్‌పల్లి : ఫిట్స్‌తో వ్యక్తి మృతి చెందిన సంఘటన ఆదివారం రాత్రి నార్కట్‌పల్లి మండలంలోని చెర్వుగట్టులో చోటుచేసుకుంది. నార్కట్‌పల్లి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని నాగోల్ సమీపంలో గల అలకాపురి కాలనీకి చెందిన కారు డ్రైవర్ గౌడుగు ప్రశాంత్ (25) అనారోగ్యానికి గురికావడంతో చెర్వుగట్టు గ్రామంలో గల శ్రీపార్వతి జడల రామలింగేశ్వరస్వామి ఆలయానికి వచ్చాడు. కోనేరులో స్నానం చేస్తుండగా ప్రశాంత్‌కు ఫిట్స్ రావడంతో కోనేరులోనే పడి చనిపోయాడు. మృతుడి తండ్రి గౌడుగు రాజేశ్వర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు నార్కట్‌పల్లి ఎస్ఐ సైదాబాబు తెలిపారు.

అనాథలకు చేయూతనివ్వాలి

చౌటుప్పల్ : అనాథలకు చేయూతనివ్వాలని సీఐ ఎస్.దేవేందర్ అన్నారు. మండల పరిధిలోని దండుమల్కాపురం గ్రామంలోని వెబర్ చైల్డ్ హోమ్‌లో విద్యార్థులతో కలిసి ఆదివారం దీపావళి వేడుకలను నిర్వహించారు. మిఠాయిలు, టపాసులను అందజేశారు. విద్యార్థులతో కలిసి బాణా సంచా కాల్చారు. జ్యోతి కోటేశ్వరరావు, శైలజ, వలి, దిలీప్, శ్రీనివాస్, కుమార్ పాల్గొన్నారు.

ముగిసిన నామినేషన్ల పరిశీలన

- నల్లగొండ నియోజకవర్గంలో మూడు..
- నకిరేకల్‌లో రెండు..
- మునుగోడులో ఒక నామినేషన్ తిరస్కరణ



నకిరేకల్ : నామినేషన్లు పరిశీలిస్తున్న ఆర్ఓ పాటిల్ హేమంత్ కేశవ్, ఎన్నికల పరిశీలకుడు బాలసుబ్రమణ్యం

నల్లగొండ : అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల పరిశీలన కార్యక్రమం సోమవారం పూర్తయింది. నల్లగొండ నియోజకవర్గంలో ముగ్గురు అభ్యర్థుల నామినేషన్లు తిరస్కరణకు గురికాగా 36 మంది నామినేషన్లకు గ్రీన్ సిగ్నల్ లభించింది. ఈ నెల 3వ తేదీ నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమై 10వ తేదీన ముగిసింది. నల్లగొండ నియోజకవర్గంలో మొత్తం 39 మంది అభ్యర్థులు 72 సెట్ల నామినేషన్ పత్రాలను సమర్పించిన విషయం తెలిసిందే. జన శంఖారావం పార్టీ అభ్యర్థి జనగాం అంజయ్య, స్వతంత్ర అభ్యర్థులు కందిమల్ల నరేందర్‌రెడ్డి, గులాం సుభానిల నామినేషన్లు ఎన్నికల నిబంధనల ప్రకారం లేకపోవడంతో స్క్రూటినీలో తిరస్కరణకు గురయ్యాయి.

నకిరేకల్ : అసెంబ్లీ ఎన్నికల నామినేషన్ల స్క్రూటినిని నకిరేకల్‌లో ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. ఎన్నికల పరిశీలకుడు బాలసుబ్రమణ్యం, ఎన్నికల రిటర్నింగ్ అధికారి, పాటిల్ హేమంత్ కేశవ్, సహాయ అధికారి ప్రసాద్‌నాయక్ నేతృత్వంలో నామినేషన్ల పరిశీలన చేపట్టారు. మొత్తం 33 మంది అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేయగా ఇద్దరు అభ్యర్థుల నామినేషన్లలో ప్రతిపాదించే వారు, ఇతర సంతకాలు లేనందున తిరస్కరించారు. ఇండిపెండెంట్ అభ్యర్థులు బల్గూరి అంజయ్య, అవిరెండ్ల వేణు నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయి. మిగతా 31 మంది అభ్యర్థుల నామినేషన్లను ఆమోదించారు. 15వ తేదీ మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణ అనంతరం పోటీలో నిలిచే అభ్యర్థుల జాబితా ప్రకటిస్తామని ఆర్ఓ పాటిల్ హేమంత్ కేశవ్ తెలిపారు.

చండూరు : అసెంబ్లీ ఎన్నికల నామినేషన్ల స్క్రూటినీని చండూరు ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో ఎన్నికల పరిశీలకుడు కే.బాల సుబ్రమణ్యం ఆధ్వర్యంలో ఆర్ఓ దామోదర్‌రావు సోమవారం నిర్వహించారు. మునుగోడు నియోజవర్గంలో మొత్తం 51 మంది అభ్యర్థులు నామినేషన్లు వేయగా.. ఇందులో పందుల పాండరి (ఇండియన్ బిలీవర్స్ పార్టీ) నామినేషన్‌ను అధికారులు తిరస్కరించారు. 50 మంది బరిలో ఉన్నారు.



చండూరు : నామినేషన్ పత్రాలను పరిశీలిస్తున్న ఆర్ఓ దామోదర్‌రావు

ధాన్యాన్ని ఆరబెట్టి తీసుకురావాలి



సిబ్బందితో మాట్లాడుతున్న డీఆర్డీఓ కాళిందిని

నార్కట్‌పల్లి: ఆరబెట్టిన ధాన్యాన్ని రైతులు కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని డీఆర్డీఓ కాళిందిని అన్నారు. సోమవారం నార్కట్‌పల్లి మండలం అక్కెనపల్లి గ్రామంలో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె సందర్శించారు. రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు నాణ్యతతో కూడిన ధాన్యం తీసుకొచ్చి మద్దతు ధర పొందాలన్నారు. రైతులు దళారులకు ధాన్యం అమ్మి మోసపోవద్దని సూచించారు. కొనుగోళ్లను వేగవంతం చేయాలని సూచించారు. ధాన్యం కొనుగోలుతో పాటు రైతుల వివరాలు త్వరగా ట్యాబ్‌లో నమోదు చేసి బిల్లు అందించాలన్నారు. ధాన్యం కొనుగోలులో సీరియల్ పాటించాలని, రైతులను ఇబ్బంది పెట్టొదని అన్నారు. సిబ్బంది అవకతవకలకు పాల్పడినట్లయితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆమె వెంట డీఆర్‌డీఏ ఏపీఎం డి.మైసేశ్వర్‌రావు, సీసీ డి.రమాదేవి, సీబీఓ సత్తిరెడ్డితో పాటు కమిటీ సభ్యులు, రైతులు తదితరులు ఉన్నారు.

రేవంత్‌తో నిర్వీర్యమైన కాంగ్రెస్ పార్టీ : ఎంపీ బడుగుల

నకిరేకల్ : రేవంత్‌రెడ్డి టీపీసీసీ అధ్యక్షుడు అయ్యాక కాంగ్రెస్ పార్టీ పూర్తిగా నిర్వీర్యమైందని, ఆయన మాటకు విలువ లేకుండా పోయిందని రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్యయాదవ్ అన్నారు. నకిరేకల్‌లోని బీఆర్ఎస్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక వ్యవసాయానికి 3 గంటల కరెంటు ఇస్తాం అని ప్రకటిస్తున్నాడని, 24 గంటలు కరెంటు ఇచ్చే బీఆర్ఎస్ ప్రభుత్వం కావాలా.. 3 గంటలు ఇచ్చే కాంగ్రెస్ కావాలా అని ప్రజలను ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు చెప్పే మాయమాటలకు ప్రజలు నమ్మి మోసపోవద్దని కోరారు. తెలంగాణలో వచ్చేది మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వమేనని అన్నారు. ఆయన వెంట డాక్టర్ చెరుకు సుధాకర్, నలగాటి ప్రసన్నరాజ్, మురారిశెట్టి కృష్ణమూర్తి, కొండ జానయ్యగౌడ్, రాచకొండ వెంకన్నగౌడ్ ఉన్నారు.

వంద రోజుల్లో ఇందిరమ్మ ఇళ్ల పథకానికి శ్రీకారం



దోమలపల్లిలో మాట్లాడుతున్న కోమటిరెడ్డి

- కాంగ్రెస్ పార్టీ నల్లగొండ ఎమ్మెల్యే అభ్యర్థి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

నల్లగొండ రూరల్ : కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన వంద రోజుల్లోనే పేదలకు ఇందిరమ్మ ఇళ్ల పథకానికి శ్రీకారం చుడతామని కాంగ్రెస్ పార్టీ నల్లగొండ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. సోమవారం నల్లగొండ మండలంలోని కంచనపల్లి, రాములబండ, దీపకుంట, కొండారం, రంగారెడ్డినగర్, దోమలపల్లి, నర్సింగ్‌బట్ల, పాతూరు, కూతురుగూడెం, చెన్నుగూడెం, కుదావన్‌పూర్, దోనకల్, గుండ్లపల్లి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే బి వెల్లెంల ప్రాజెక్టు పూర్తిచేసి కాల్వల ద్వారా సాగు నీరు అందిస్తామన్నారు. ఈకార్యక్రమంలో జెడ్పీటీసీ వంగూరి లక్ష్మయ్య, ఎంపీపీ సుమన్, కాంగ్రెస్ పార్టీ నల్లగొండ పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి, సతీష్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, నర్సింహ, యాదగిరి, తాజ్‌జకీర, అయ్యాడపు ప్రకాష్‌రెడ్డి, తంతనపల్లి శైలజ శ్రీనివాస్‌గౌడ్, సహదేవ్ తదితరులు పాల్గొన్నారు.

అవినీతి, అక్రమాలను ప్రజలకు తెలియజేయాలి



మర్రిగూడ : పార్టీలోకి ఆహ్వానిస్తున్న కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

- కాంగ్రెస్ పార్టీ మునుగోడు అభ్యర్థి కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి

మునుగోడు : ఏ పార్టీ ప్రజాప్రతినిధి అయినా, ఎంత పెద్ద అధికారి అయినా సరే అవినీతి అక్రమాలకు పాల్పడితే నిర్భయంగా ఆ అవినీతిని ప్రజలకు వివరించాలని కాంగ్రెస్ పార్టీ మునుగోడు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి విలేకరులను కోరారు. సోమవారం మునుగోడులోని తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటుచేసిన నియోజకవర్గస్థాయి విలేకర్లతో ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు.

కాంగ్రెస్‌లో చేరిక

మునుగోడు మండలంలోని చొల్లేడు, రావిగూడెం, ఊకొండి గ్రామాలకు చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు రాజగోపాల్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరినవారిలో చొల్లేడు గ్రామ ఉప సర్పంచ్ గోదాల శంకర్ రెడి ఉన్నారు.

మర్రిగూడ : మండలంలోని పలువురు నాయకులు, రాజగోపాల్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. లెంకలపల్లికి చెందిన పాక నగేష్‌యాదవ్, రాజాపేట సర్పంచ్ నూన్సావత్ సక్కుబాయిబిచ్చా నాయక్, మేటిచందాపురం సర్పంచ్ జంగిలి లక్ష్మీప్రసన్నరవి, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బేత వెంకటేష్‌యాదవ్‌ల ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు.

బీఆర్ఎస్ పార్టీలో చేరిక

చిట్యాల : పట్టణానికి వివిధ పార్టీల నాయకులు బీఆర్ఎస్ పార్టీ నకిరేకల్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి చిరుమర్తి లింగయ్య సమక్షంలో సోమవారం బీఆర్ఎస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ జడల ఆదిమల్లయ్య, మున్సిపల్ వైస్ చైర్మన్ కూరెళ్ళ లింగస్వామి,శేపూరి రవీందర్ తదితరులు పాల్గొన్నారు. పార్టీలో చేరిన వారిలో మైల సూకేష్, సిలివేరు భాను వంశి, కంబాలపల్లి ప్రవీణ్, మిడిదొడ్డి సాయికిరణ్, బొడ్డుపల్లి వరప్రసాద్, సాయినోజు వినయ్, తిరుపాల గణేష్ తదితరులు న్నారు.

కేతేపల్లి మండలంలో..

కేతేపల్లి : మండలంలోని కొత్తపేట గ్రామానికి చెందిన వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు సోమవారం స్థానిక ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో నకిరేకల్ ఏఎంసీ చైర్మన్ కొప్పుల ప్రదీప్‌రెడ్డి, జెడ్పీటీసీ బొప్పని స్వర్ణలతసురేష్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మారం వెంకట్‌రెడ్డి, సర్పంచ్ బచ్చు జానకిరాములు, ఉప సర్పంచ్ తండు రాములు, గ్రామశాఖ అధ్యక్షుడు ఆర్.సైదులు తదితరులు పాల్గొన్నారు. బీఆర్ఎస్‌లో చేరిన వారిలో నారగోని ఉపేందర్, చింత నర్సింహ, రాగ ముత్తయ్య, లాజర్, ఏసోబు, షేక్ జానిమియా, చింతపల్లి అశోక్, లింగం రమేష్, గాజుల వంశీ, భరత్, ప్రవీణ్ తదితరులు ఉన్నారు.

తండు సైదులు సమక్షంలో..

రామగిరి(నల్లగొండ): తిప్పర్తి మండలం వెంకటాద్రిపాలెం గ్రామంలో మాజీ జెడ్పీటీసీ తండు సైదులుగౌడ్ ఆధ్వర్యంలో సోమవారం కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు నాయకులు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో పల్లె శేఖర్, పల్ల రాజు, నాగయ్య, కొల్లు సత్తయ్యపాల్గొన్నారు.

శాలిగౌరారం : మండలంలోని ఆకారం గ్రామంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన పది కుటుంబాలు ఆ పార్టీకి రాజీనామా చేసి సోమవారం బీఆర్ఎస్ పార్టీలో చేరారు. బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు అయితగోని వెంకన్న, బైరు నాగరాజు, అక్కెనపల్లి లింగయ్య, కారింగుల పాండు, వేముల సైదులు, లెనిన్, విజయ్, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

పాల్వాయి స్రవంతి ఆధ్వర్యంలో..

మునుగోడు : టీపీసీసీ అధికార ప్రతినిధి పాల్వాయి స్రవంతి కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి మంత్రి కేటీఆర్ సమక్షంలో ఆదివారం బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఆమెతోపాటు మునుగోడు మండలానికి చెందిన పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. బీఆర్ఎస్‌లో చేరినవారిలో ఎల్లగలగూడెం ఉప సర్పంచ్ మేకల శ్రీనివాస్ రెడ్డి, పలివెల డీసీసీబీ డైరక్టర్ మార్త మోహన్ రెడ్డి, చీకటిమామిడి మాజీ సర్పంచ్ మారగోని అంజయ్య గౌడ్, వివిధ గ్రామాలకు చెందిన గ్రామశాఖ అధ్యక్షులు, నాయకులు ఉన్నారు.

వివిధ పార్టీల నుంచి బీజేపీలోకి

మర్రిగూడ : మండలంలోని పలు గ్రామాలకు చెందిన వివిధ పార్టీల కార్యకర్తలు సోమవారం బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి చలమల్ల కృష్ణారెడ్డి సమక్షంలో బీజేపీలో చేరారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ దూడల భిక్షం, కడగంచి రమేష్, యాస అమరేందర్‌రెడ్డి, పిట్టల శ్రీనివాస్, జిల్లా కిశోర్, గ్యార గోపాల్, మామిడి పరుశురాము, రాజేందర్ నాయక్, లోకేష్‌రెడ్డి, దేవేందర్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

చీకటిమామిడి మాజీ సర్పంచ్ బీజేపీలోకి..

మునుగోడు : మండలంలోని చీకటిమామిడి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ పాలకూరి యాదయ్య గౌడ్ కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేశారు. ఆయనకు బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి చలమల్ల కృష్ణారెడ్డి సోమవారం కండువా కప్పి బీజేపీలోకి ఆహ్వానించారు.

విలీన గ్రామాలను విస్మరించిన బీఆర్ఎస్, కాంగ్రెస్

- నల్లగొండ నియోజకవర్గ సీపీఎం అభ్యర్థి ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి

నల్లగొండటౌన్ : నల్లగొండ మున్సిపాలిటీలో 2013లో విలీనమైన ఏడు గ్రామపంచాయతీల అభివృద్ధిని విస్మరించిన కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థులను ఓడించాలని నల్లగొండ నియోజకవర్గ సీపీఎం ఎమ్మెల్యే అభ్యర్థి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం చర్లపల్లిలోని సప్తగిరి విలాస్, సాయి ద్వారకా, సాయి బాలాజీ, సాయి సదన్ గేటెడ్ కాలనీల్లో ఇంటింటికి తిరిగి ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజలందరూ ఆదరించి సుత్తి కొడవలి నక్షత్రం గుర్తుపై ఓట్లు వేసి తనను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు సయ్యద్ హాశం, పట్టణ కార్యదర్శి ఎండీ సలీమ్, సీనియర్ నాయకుడు ఊట్కూరి నారాయణరెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు దండెంపల్లి సత్తయ్య, తుమ్మల పద్మ, పుచ్చకాయల నర్సిరెడ్డి, కుంభం కృష్ణారెడ్డి, పట్టణ కమిటీ సభ్యులు పిన్నపురెడ్డి మధుసూదన్ రెడ్డి, దండెంపల్లి సరోజ, భూతం అరుణ, కాసర్ల గౌతంరెడ్డి, కోట్ల అశోక్ రెడ్డి, గౌరీదేవి మధు, జంజరాల సైదులు, మల్లయ్య, కాసర్ల సాత్విక్ తదితరులు పాల్గొన్నారు.

పేదల అభివృద్ధికి సీపీఎం కృషి

రామగిరి(నల్లగొండ): పేద ప్రజల అభివృద్ధికి సీపీఎం కృషి చేస్తోందని నల్లగొండ నియోజకవర్గ సీపీఎం అభ్యర్థి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి అన్నారు. సోమవారం తిప్పర్తి మండలం ఎర్రగడ్డలగూడెం, సోమోరిగూడెం, లక్ష్మీపురం గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు వెంకటరమణారెడ్డి, మన్నెం భిక్షం, భీమిరెడ్డి సీతారాంరెడ్డి, శంకరయ్య, కుమ్మరి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి చేశా.. మరోసారి ఆశీర్వదించి గెలిపించండి

- బీఆర్ఎస్ పార్టీ నల్లగొండ అభ్యర్థి కంచర్ల భూపాల్‌రెడ్డి



నల్లగొండ టూటౌన్ : పార్టీలోకి ఆహ్వానిస్తున్న కంచర్ల భూపాల్‌రెడ్డి



కంచర్ల భూపాల్‌రెడ్డితో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ మీర్జా రహ్మతుల్లా బేగ్

కనగల్ : నల్లగొండ పట్టణాన్ని సీఎం కేసీఆర్ సహకారంతో అన్ని రంగాల్లో అభివృద్ధి చేశాను, రాబోయే ఎన్నికల్లో ప్రజలు మరోసారి తనను ఆశీర్వదించి భారీ మెజార్టీతో గెలిపించాలని బీఆర్ఎస్ పార్టీ నల్లగొండ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కంచర్ల భూపాల్‌రెడ్డి కోరారు. సోమవారం కనగల్ మండల పరిధిలోని తేలకంటిగూడెం, జి యడవల్లి గ్రామాలకు చెందిన కాంగ్రెస్ కార్యకర్తలు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా భూపాల్‌రెడ్డి మాట్లాడుతూ 4 పర్యాయాలు ఎమ్మెల్యేగా, మంత్రిగా పనిచేసిన కోమటిరెడ్డితో నల్లగొండకు ఒరిగిందేమి లేదన్నారు. సీఎం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలే బీఆర్ఎస్ పార్టీని గెలిపిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కరీంపాషా, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అయితగోని యాదయ్యగౌడ్, పీఏసీఎస్ చైర్మన్లు వంగాల సహదేవరెడ్డి, దోటి శ్రీనివాస్, ఎర్రబెల్లి నర్సిరెడ్డి, సర్పంచ్ పులకరం యాదమ్మమారయ్య, ఎంపీటీసీ కర్నాటి పద్మజగత్, ఆవుల నరేందర్, బైరగోని వెంకన్నగౌడ్, బుర్రి శ్రీమాన్‌కుమార్ తదితరులున్నారు.

బీఆర్ఎస్ పార్టీలో చేరిక

నల్లగొండ టూటౌన్ : నల్లగొండ పట్టణంలో వివిధ వార్డులకు చెందిన యువకులు సోమవారం బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కంచర్ల కృష్ణారెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేశారు. 35వ వార్డు కౌన్సిలర్ గుర్రం ధనలక్ష్మీ వెంకన్న, 37వ వార్డు ఇన్‌చార్జి భాస్కర్ ఆధ్వర్యంలో 200 మందికి పైగా బీఆర్ఎస్‌లో చేరారు. అదేవిధంగా కనగల్ మండలం జి.యడవెల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్త ఆవుల నరేందర్ ఆధ్వర్యంలో 50మంది ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో గుర్రం వెంకన్న, భాస్కర్, సింగిల్ విండో చైర్మన్ దోటి శ్రీనివాస్, కనగల్ మండల అధ్యక్షుడు ఐతగాని యాదయ్య, ఎంపీటీసీ జగత్, సర్పంచ్ మారయ్య, భూపతి పాల్గొన్నారు.

కంచర్ల భూపాల్‌రెడ్డికి ఎంఐఎం మద్దతు

నల్లగొండ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కంచర్ల భూపాల్‌రెడ్డికి సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్లు ఎంఐఎం ఎమ్మెల్సీ మీర్జా రహ్మతుల్లా బేగ్ ఆధ్వర్యంలో స్థానిక ఎంఐఎం నాయకులు సోమవారం ప్రకటించారు. ఈ సందర్భంగా కంచర్ల నివాసంలో ఎమ్మెల్సీ మీర్జా రహ్మతుల్లా బేగ్ మాట్లాడుతూ మైనార్టీలు అందరూ బీఆర్ఎస్ పార్టీకి ఓటేసి కంచర్ల భూపాల్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. భూపాల్‌రెడ్డి తరఫున ఎంఐఎం పార్టీ నాయకులు ప్రచారం చేస్తారని తెలిపారు. కంచర్ల భూపాల్‌రెడ్డి మాట్లాడుతూ తనకు మద్దతు తెలిపిన ఎంఐఎం పార్టీ అధ్యక్షుడికి, ముఖ్య నాయకులకు, ఎమ్మెల్సీకి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఐఎం నాయకులు మహ్మద్ రజియోద్దీన్, రఫీయుద్దీన్ హాజి, గౌస్ మహ్మద్, మల్లిక్, సిరాజుద్దీన్, షరీఫ్‌ఖాన్, సమీరుద్దీన్ పాల్గొన్నారు.

60 మందికిపైగా యువకులు బీఆర్ఎస్‌లోకి..

నల్లగొండ పట్టణంలోని 24వ వార్డుకు చెందిన కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు ఎస్.కె. అమేర్ ఆధ్వర్యంలో 60 మందికి పైగా యువకులు సోమవారం కంచర్ల భూపాల్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు దేవేందర్, నూరుద్దీన్, ఆమేర్, మతీన్, నయబ్, రఫీ, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

ఆనందోత్సాహాలతో దీపావళి వేడుకలు

నల్లగొండ, నకిరేకల్, మునుగోడు నియోజకవర్గాల్లో అన్ని పట్టణాలు, గ్రామాల్లో దీపావళి వేడుకలను ప్రజలు ఆదివారం ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. నోములు వ్రతాలు, పూజలు నిర్వహించారు. టపాసులు కాల్చారు.

– సాక్షి నెట్‌వర్క్



నల్లగొండ పట్టణంలోని రామగిరిలో టపాసులు కాలుస్తున్న చిన్నారులు



రామగిరిలో..



నల్లగొండలోని పద్మావతి కాలనీలో..

కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిక



బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న మంత్రి కేటీఆర్


చండూరు : మున్సిపాలిటీ కేంద్రానికి చెందిన పలువురు బీజేపీ ముఖ్య నాయకులు ఆదివారం హైదరాబాద్‌లో మంత్రులు కేటీఆర్, జగదీశ్‌రెడ్డి మునుగోడు ఎమ్మెల్యే అభ్యర్థి కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ తోకల వెంకన్న, కౌన్సిలర్ అన్నపర్తి శేఖర్, మధుసూదన్‌రావు, అనిల్‌రావు పాల్గొన్నారు. బీఆర్ఎస్‌లో చేరినవారిలో కౌన్సిలర్ గుంటి వెంకటేశం, కొత్తపాటి సతీష్, బీజేపీ పట్టణ అధ్యక్షుడు అన్నపర్తి యాదగిరి, జిల్లా కార్యవర్గ సభ్యుడు ఏనుగు వెంకట్‌రెడ్డి, పట్టణ కోశాధికారి కొత్త అంజిబాబు, కార్యదర్శి రాపోలు జగదీశ్వర్, ఓబీసీ మోర్చా అధ్యక్షుడు రాపోలు వెంకటేశం, ప్రధాన కార్యదర్శి ఇడికోజు నాగరాజు, బూత్ అధ్యక్షుడు రావిరాల భార్గవ్, బుషిపాక నగేష్ తదితరులు ఉన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

చౌటుప్పల్ : కాంగ్రెస్ పార్టీ ఓబీసీ సెల్ మండల కమిటీని ఆదివారం ఓబీసీ సెల్ మండల అధ్యక్షుడు నల్లెంకి వెంకటేష్‌గౌడ్ ప్రకటించారు. మండల ఉపాధ్యక్షుడిగా నందగిరి శివ, పొట్ట సాయికుమార్, ప్రధాన కార్యదర్శులుగా బాతరాజు లింగస్వామి, గుండ్ల చంద్రశేఖర్, ఆర్గనైజర్‌గా వంగాల లింగస్వామి, సెక్రటరీలుగా నల్లెంకి రమేష్, రాచకొండ శ్రీను, వరికుప్పల మహేష్, వర్కాల బాలరాజు, మస్రం శివ, దంతరబోయిన నవీన్, దేవరకొండ శ్రీకాంత్,చారి, మోటె నవీన్‌లు నియమితులయ్యారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తాడూరి వెంకట్‌రెడ్డి, జెడ్పీటీసీ చిలుకూరి ప్రభాకర్‌రెడ్డి, కుర్నాల వెంకటేష్, నాయకులు ఇంద్రసేనారెడ్డి, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ సెంటర్ లేక ప్రజల అవస్థలు

- ఏడాదిన్నరగా మూతబడిన కేతేపల్లి ఆధార్ కేంద్రం
- కార్డుల్లో తప్పుల సవరణ కోసం ఇతర మండలాలకు వెళ్తున్న ప్రజలు




కేతేపల్లి తహసీల్దారు కార్యాలయంలో గతంలో ఏర్పాటు చేసిన ఆధార్ సెంటర్

కేతేపల్లి : మండల కేంద్రంలో ఆధార్ నమోదు కేంద్రం లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతంలో మండలం మొత్తానికి ఒకే ఆధార్ సెంటర్‌ను కేతేపల్లిలోని తహసీల్దారు కార్యాలయంలో ఏర్పాటు చేశారు. మండలంలోని 16 గ్రామాల ప్రజలు ఇక్కడి నుంచే ఆధార్ సేవలు పొందేవారు. కాగా నిర్వాహకులు నిబంధనలు పాటించకపోవడం, తిరస్కరించే దరఖాస్తులు ఎక్కువగా వస్తుండడంతో ఉన్నతాధికారులు ఏడాదిన్నర క్రితం ఆధార్ సెంటర్ ఐడీని సస్పెండ్ చేశారు. నేటి వరకు మండల కేంద్రంలో ఆధార్ సెంటర్ అందుబాటులోకి రాలేదు.

తప్పని ఇబ్బందులు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే పథకాలకు రాయితీలు పొందాలన్నా, బ్యాంకులో ఖాతా తెరవాలన్నా, పాన్‌కార్డు, పాస్‌పోర్టుకు దరఖాస్తు చేయాలన్నా ఆధార్‌కార్డు తప్పనిసరి. 2015 కంటే ముందు ఆధార్ గుర్తింపు పొందిన వారు యూఐడీఏ సంస్థ ఆదేశాల మేరకు సంబంధిత ప్రతాలతో తప్పనిసరిగా అప్‌డేట్ చేసుకోవాలి. 15 ఏళ్ల చిన్నారులు బయోమెట్రిక్ చేసుకోవాలి. ఇందు కోసం సదరు వ్యక్తులు ఆధార్ నమోదు కేంద్రానికి వెళ్లాలి. మండలంలో ఆధార్ సెంటర్ పనిచేయకపోవడంతో ప్రజలు ఇక్కడి నుంచి 10 కి.మీ. దూరంలో ఉన్న నకిరేకల్, 15 కి.మీ దూరంలో ఉన్న సూర్యాపేట పట్టణాలకు వెళుతున్నారు. ఆధార్‌లో ఏ చిన్న మార్పు చేయాలన్నా వ్యయ ప్రయాసల కోర్చి ఇతర ప్రాంతాలకు వెళ్లి రావాల్సి వస్తోంది. ఇతర ప్రాంతాలకు వెళితే ఆధార్ సేవలకు ఎక్కువ డబ్బులు సైతం వసూలు చేస్తున్నారని పలువురు వాపోతున్నారు. కొన్నిమార్లు అక్కడ ఆన్‌లైన్ సేవలు నిలిచిపోయాయని, ఏదైనా ధృవీకరణ పత్రం, అధికారుల సంతకాలు లేకపోతే నిర్వాహకులు తిప్పి పంపుతున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో పని కాకుండానే వెనుదిరిగి రావాల్సి వస్తోందని ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. కేతేపల్లి మండలకేంద్రంలో ఆధార్ సెంటర్ ప్రారంభించినట్లయితే దూరభారం తగ్గడంతోపాటు సమయం, రవాణా చార్జీలు ఆదా అవుతాయని స్థానిక ప్రజలు పేర్కొంటున్నారు. అధికారులు స్పందించి కేతేపల్లిలో ఆధార్ సెంటర్‌ను అందుబాటులోకి తీసుకురావాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ఆధార్ సెంటర్‌ను ప్రారంభించాలి



కేతేపల్లి మండలంలో ఆధార్ సెంటర్ లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇతర ప్రాంతాలకు వెళ్తే ఉదయం నుంచి సాయంత్రం వరకు వేచి చూడాల్సి వస్తోంది. సమయం వృథా కావడంతోపాటు రవాణా చార్జీలు భారమవుతున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి మండల కేంద్రంలో ఆధార్ సెంటర్‌ను మళ్లీ ప్రారంభించాలి.

–అక్కెపల్లి రవి, కేతేపల్లి